క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల దాడులు



నామవరంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

చింతలపూడి: చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నామవరంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని నిందితుడు భూక్యా నరేష్‌పై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుదూడల అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

ద్వారకాతిరుమల: ఆవుదూడలను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై టి.సుధీర్ కథనం ప్రకారం. ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు ఆవుదూడలను ఓ వ్యాన్‌లో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో మండలంలోని ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై పోలీసులు వ్యాన్‌ను అడ్డుకున్నారు. అందులో 50 ఆవుదూడలున్నాయని గుర్తించి వ్యాన్‌ను సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నల్గొండ జిల్లా జల్దాండకు చెందిన వ్యాన్ డ్రైవర్ డిప్పావత్ భగవాన్, సూర్యాపేటకు చెందిన క్లీనర్ భుక్యా నరేష్‌ను అరెస్టు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ విమాన గోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు శుక్రవారం రూ. 1,10,001 విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామానికి చెందిన తాండ్ర ప్రకాష్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటిండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం



టి.నరసాపురంలో బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: టి.నరసాపురం హిందూ శ్మశాన వాటికలో శుక్రవారం నూతనంగా బోరు, మోటారును ప్రారంభించినట్లు కటకం కొండ అన్నారు. బోరు మోటారుకు రూ. 2 లక్షలు అందించిన ఎన్నారై మరీదు రామకృష్ణ బోరుమోటార్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్మశాన వాటిక అభివృద్ధి సంఘ అధ్యక్షుడు కటకం కొండ మాట్లాడుతూ బోరు మోటారు, ట్యాంకు, కరెంటుకు రూ. 2 లక్షలు పైగా అందించిన ఎన్నారై రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. శ్మశాన వాటిక ఆర్చి ప్రహరీ గోడ నిర్మాణానికి సురేష్ రాజు, రమేష్ రాజు అన్నదమ్ములు సహకరించారని తెలిపారు. మిగతా అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఎన్నారై మరీదు రామకృష్ణ మాట్లాడుతూ తన సొంత ఊరు అభివృద్ధికి తన వంతు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మరీదువెంకట నాగేశ్వరరావు, కన్నం శ్రీనివాసరావు, సురేష్ రాజు, చేబోలు శ్రీను, పబ్బు జయరాజు పాల్గొన్నారు.

గంగవరంలో వైద్య పరీక్షలు

కొయ్యలగూడెం: రాజవరం పంచాయితీ పరిధిలోని గంగవరంలో బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆరోగ్య వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి యల్.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ ఎస్‌కే చాన్‌బాషా, హెచ్‌పీఎం సంధ్య, ఏఎన్‌ఎం ఈ.కృష్ణకుమారి, ఆశాలు సీహెచ్ సువార్త, కె.ప్రభావతి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి



కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పేద ప్రజలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు మంజూరు చేయాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుబ్బారావుకు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. నాయకులు దుగ్గిరాల నారాయణరావు, ఎల్లిబోయిన లక్ష్మి, సత్యభామ, చింతలపూడి దుర్గారావు, పెద్దకాపు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం నిర్మాణం

- నిలిచిపోయిన పనులు
- ఇండోర్ స్టేడియం నిర్మాణంపై పాలకులు, అధికారుల స్పందన కరువు
- క్రీడా శిక్షణకు యువత ఎదురుచూపు



చింతలపూడిలో అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం నిర్మాణం

చింతలపూడి: నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలో నిర్మాణం చేపట్టిన ఇండోర్ స్టేడియం ఎప్పుడు పూర్తవుతుందని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆట స్థలంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఇండోర్ స్టేడియంకు ముఖ్యమంత్రి చంద్రబాబు 2018 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. రాష్ట్ర క్రీడా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పట్లోనే ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడం కారణంగానే కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసినట్లు చెప్తున్నారు. చంద్రబాబు చింతలపూడి వస్తున్నారని హడావుడిగా శంకుస్థాపన చేయించారు. శిలాఫలకాలకు, శంకుస్థాపన ఖర్చులకు కాంట్రాక్టర్‌తో సుమారు రూ.10 లక్షలు ఖర్చు పెట్టించారు. తీరా బిల్లులు చెల్లించమంటే అప్పటి టీడీపీ ప్రభుత్వం చేతులెత్తేసిందని కాంట్రాక్టర్ ఆరోపిస్తున్నాడు. పట్టణం నడిబొడ్డున ఉన్న అత్యంత ఖరీదైన స్థలంలో ఇండోర్ స్టేడియం వద్దని పట్టణ ప్రజలు మొరపెట్టుకున్నా అప్పట్లో ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇదే ప్లే గ్రౌండ్‌లో మినీ స్టేడియం మంజూరు చేస్తామని గతంలో అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు కాని ఆచరణలో అమలు చేయలేదు. ఇండోర్ స్టేడియం కూడా ఇక్కడే ప్రారంభించడంతో ఇక మినీ స్టేడియంపై క్రీడాకారులు ఆశలు వదులుకున్నారు. ఇండోర్ స్టేయంతో పాటు శాశ్వత ప్రాతిపదికన కబడ్డీ, బ్యాడ్మింటన్ కోర్టులు నిర్మిస్తామని చెప్పారు. ఆరంభ శూరత్వం తప్ప మినీ స్టేడియం మూలన పడింది. ఇంక కబడ్డీ, బ్యాట్మింటన్ కోర్టులు ఎక్కడ నిర్మిస్తారని పట్టణ ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇలా ఉండగా చేసిన పనుల వరకైనా బిల్లులు చెల్లించాలని ఏడు సంవత్సరాలుగా కాంట్రాక్టర్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. వడ్డీకి అప్పులు తెచ్చి ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు చేశానని ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో చంద్రబాబు శంకుస్థాపన చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోర్టులో తనకు న్యాయం చేయాలని కేసు వేసినట్లు తెలిపాడు.

> **స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలి**
>
> 
>
> సకాలంలో బిల్లులు చెల్లించి ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలి. ప్రస్తుతం సరైన క్రీడా సదుపాయాలు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనం నిర్మాణ పనులు నిలిచి పోవడం కారణంగా శిథిలావస్థకు చేరుకుంది.
>
> – చిలుకూరి జ్ఞానారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మాతృభాష ప్రాముఖ్యతను వివరించాన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కవితా పఠనం, పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రం, బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, ఉమ, సిబ్బంది అన్నపూర్ణమ్మ, రత్న సిరిలో పాల్గొన్నారు.



కామవరపుకోట: సభలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు



బుట్టాయగూడెం: వంకవారిగూడెం పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఎన్‌జీకే నరేంద్ర కుమార్ మాతృభాష ప్రాముఖ్యతను తెలియజేశారు. అధ్యాపకులు బి. శ్రీనివాసరావు ,డాక్టర్ జి శ్రీనివాస్, డాక్టర్ ఏ. సంతోషరావు, శంకర పోలయ్య, శ్రీ బి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎం సుబ్బారావు ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తెలుగు ఆకృతి ప్రదర్శన

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగు అక్షరాల ఆకృతి ఆకారంలో కూర్చుని చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విజ్ఞాన కేంద్రం పాఠశాల పరిపాలనా అధికారి తనికెళ్ల సత్యరవికుమార్ తదితరులు పాల్గొన్నారు. బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీయూవీఎన్ మణీంద్రరావు, అధ్యాపకులు ఎం. వెంకటేశ్వరరావు, డాక్టర్ అక్కులన్న, వై. సునీత పాల్గొన్నారు.

పంగిడిగూడెం హైస్కూల్లో..

ద్వారకాతిరుమల: పంగిడిగూడెం హైస్కూల్లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలను పాఠశాల హెచ్‌ఎం పి.సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతృ భాష అయిన తెలుగు భాషను గౌరవించాలని కోరారు. తెలుగు పండిట్ డాక్టర్ పెద్దిరాజు అంతర్జాతీయ మాతృ భాష చారిత్రక నేపథ్యాన్ని వివరించారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పెద్దిరాజు, కె.రమేష్‌లు ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులు మల్లయ్య, కుమార్ స్వామి, శారద, ప్రభాకర్, పద్మ, మహాలక్ష్మి, సీతామహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

పోలవరం రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పోలవరంలోని విజ్ఞాన భారతి హైస్కూల్లో పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. మాతృమూర్తులకు వారి పిల్లలతో పాద పూజలు నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం తల్లులకు పసుపు, కుంకుమ, తాంబూలం, రవిక గుడ్డలను అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు నాగిరెడ్డి ఆనందరావు, ఆకుల నరసింహమూర్తి, మూలెం వెంకన్నబాబు, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం

పోలవరం రూరల్: పట్టభద్రుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేసే జీవీ సుందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. శుక్రవారం పోలవరంలోని రివర్ ఇన్ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ తదితర ఆచరణకు సాధ్యం కాని సంక్షేమ పథకాలను అందజేస్తానని హామీలు గుప్పించి అధికారం వచ్చిన తరువాత వాటిని విస్మరించారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సాబ్బన మోహన్, కేఆర్‌కోటేశ్వరరావు, అనంతలక్ష్మి, ఈర్నాల జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మానవత సహాయం

జంగారెడ్డిగూడెం: వృద్ధ దంపతులకు మానవత సభ్యులు సహాయాన్ని అందించారు. స్థానిక మార్కండేయపురానికి చెందిన అంకనబోయిన నారయ్య, సుబ్బమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరి కుమార్తె పక్షవాతంతో మంచం మీదే ఉంది. కాళ్ల నొప్పులతో కూలి పనికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మానవత సభ్యులు స్పందించి మానవత సంస్థ తరుపున రూ. 5వేలు, మానవత ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ అందించిన రూ.1,500, మొత్తం రూ.6,500 వృద్ధ దంపతులకు అందజేశారు. మండలాధ్యక్షులు అయినాల వెంకటరమణమూర్తి, అల్లూరి రామకృష్ణ, గద్దే సత్యనారాయణ, త్రిపుర రమేష్, ఆకుల ధర్మరాజు, ఇమ్మంది మాధవరావు, డీపీ రెడ్డి, దల్లి పెద్దవీర్రాజురెడ్డి, తిరుపతి రమేష్ పాల్గొన్నారు.

సుందరగిరిపై మహాయజ్ఞానికి ఏర్పాట్లు



సుందరగిరిపై నారసింహుని ఆలయ యాగ శాలలో హోమం నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృసింహ 31వ మహాయజ్ఞ నిర్వహణకు శుక్రవారం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఉదయం గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు వేద పండితులు, రుత్విక్కులు వేద మంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీ నరసింహ గురూజీ ఆధ్వర్యంలో, సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షణలో ప్రధాన యజ్ఞం ప్రారంభానికి సూచికగా మహా గణపతి లక్షమోదక హోమాన్ని ఆలయ యాగశాలలో వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ యజ్ఞ క్రతువులో భాగంగా ఈనెల 23న అంకురార్పణ, ధ్వజారోహణ, కలశస్థాపన, 24న మూలవరులకు అభిషేకం, నవనృసింహ హోమం , 25న మహాగణపతి హోమం, 26న సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, అతిరుద్రప్రయోగ సహిత సుదర్శన నృసింహ మహాయజ్ఞం, 27న మహాశాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని లక్ష్మీనరసింహ గురూజీ తెలిపారు. ప్రతి రోజూ ఆలయంలో సాలిగ్రామ అభిషేకం, లక్షబిల్వార్చన, లక్షతులసీ దళార్చన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ



నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం, మూలవిరాట్‌కు ఏకదశ హారతి పూజలు, వేద దర్బారు సేవ, చతుర్వేత స్వస్తి, నీరాజన మహామంత్రం తదితర పూజలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి రజత వస్త్రానికి హైదరాబాద్‌కు చెందిన కోమలగిరి రామానంద్, విజయలక్ష్మి దంపతులు 5 తులాల వెండి, రుద్రుల లక్ష్మీ సూర్యకుమారి కుమారులు సోమేశ్వరరావు, హనుమాన్ ప్రసాద్, కుటుంబ సభ్యులు 5 తులాల వెండిని సమర్పించినట్లు చెప్పారు. ఆలయంలో కొలువైన నర్మద అమృత బాణ లింగేశ్వరస్వామికి ఈ నెల 26న ఏకవార రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం సభ్యులు కొరుపూరి రాంబాబు, అమ్మోజి దంపతులు కట్టు పొంగలి ప్రసాదాన్ని వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్లో కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

జంగారెడ్డిగూడెం: క్రీడల వల్ల విద్యార్థులకు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని జంగారెడ్డిగూడెం మండల విద్యాశాఖ అధికారి బుద్ధుల రాముడు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలవరం నియోజకవర్గ జోనల్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి బుద్ధుల రాముడు క్రీడా మైదానంలో రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. శుక్రవారం అథ్లెటిక్స్ విభాగంలో బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహించగా, శనివారం బాలురకు క్రీడ పోటీలు నిర్వహిస్తామని పీడీ జయరాజు తెలిపారు. ఏడు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారి మాట్లాడుతూ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు తమ పాఠశాలను వేదికగా ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. బాల బాలికలకు అథ్లెటిక్స్‌లో 100మీ, 200మీ, 400మీ, 600మీ, లాంగ్‌జంప్, షాట్‌పుట డిస్కస్‌త్రో, బాలికలకు వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.జయరాజు, ఏడు మండలాల నుంచి 70 మంది పీడీలు, కొయ్యలగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలి

బుట్టాయగూడెం: ఆదివాసీ చట్టాలను సక్రమంగా అమలు చేసేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అంతర్వేదిగూడెం, పందిరిమామిడిగూడెంలో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సంబంధించిన తీర్మానాలను సూచించారు. సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో నూతన నియామకాలు



మోరంపూడి జగన్



మత్తె శిరీష



నారిశెట్టి రామారావు



నత్తా మరియమ్మ



పరసా ప్రశాంత్



షేక్ అక్బర్



కాసర సుబ్బారెడ్డి (బన్నీ)



నరెడ్ల బుజ్జిబాబు



గూడపాటి రాధాకృష్ణ



షేక్ హీరాహకీం



ఎం. వెంకటేశ్వరరావు



వీపీడీ లివింగ్‌స్టన్ (ఐజక్)



కోట సుబ్బారావు

లింగపాలెం: వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు పార్టీ నాయకులను వివిధ హోదాల్లో నియమిస్తూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహనరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు అందాయి. ఈ నియామకాల్లో ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ కమిటీలో ఒకరికి లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంకు చెందిన మోరంపూడి జగన్‌కు జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా లింగపాలెం మండలం నుంచి ఐదుగురు చోటు సాధించారు. మండలంలోని అయ్యపరాజుగూడెంకు చెందిన మత్తె శిరీష చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ వలంటరీ విభాగం అధ్యక్షురాలుగా, భోగోలు గ్రామానికి చెందిన నారిశెట్టి రామారావు, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా, వేములపల్లికి చెందిన నత్తా మరియమ్మ చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలుగా, ముడిచెర్లకు చెందిన పరసా ప్రశాంత్, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ టీయూసీ విభాగం అధ్యక్షులుగా, లింగపాలెంకు చెందిన గోలి శ్రీనివాసరెడ్డి చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులుగా నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకంలో జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోని పలువురికి చోటు దక్కింది. చింతలపూడి నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాలకు సంబంధించి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన షేక్ అక్బర్, స్టూడెంట్ విభాగానికి సంబంధించి కాసర సుబ్బారెడ్డి (బన్నీ) అధ్యక్షుడిగా నియమితులయ్యారు. పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ, కేతవరానికి చెందిన నరెడ్ల బుజ్జిబాబు నియమితులయ్యారు. మున్సిపల్ విభాగానికి సంబంధించి అధ్యక్షుడిగా గూడపాటి రాధాకృష్ణ, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా షేక్ హీరాహకీం, బూత్ కమిటీ అధ్యక్షుడిగా మొగల్నీడి వెంకటేశ్వరరావు (శ్యామ్), క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా వీపీడీ లివింగ్‌స్టన్ (ఐజీ), డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా డాక్టర్ కోట సుబ్బారావు నియమితులయ్యారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయంకుల సత్యనారాయణను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కామవరపుకోట: చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విభాగాల అధ్యక్షులుగా కామవరపుకోట మండలం నుంచి ఏడుగురిని నియమించారు. చేనేత విభాగం అధ్యక్షుడిగా తమ్మిశెట్టి గిరిజ నాగ సరస్వతి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా బందెల ప్రభాకర్ ఆనంద్, లీగల్ విభాగం అధ్యక్షుడిగా తమ్మిశెట్టి నాగేంద్ర పనిదీప్, ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడిగా మేరుగు బాబురావు, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా చిలుకూరి సుబ్బారావు, మేధావులు ఫొరం విభాగం అధ్యక్షుడిగా నాగమల్లేశ్వరరావు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా వెర్రి శ్రీను, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా చొక్కా నాగరాజు నియమితులయ్యారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన రామన్నపాలెంకు చెందిన రాయంకుల సత్యనారాయణను శుక్రవారం పలువురు నాయకులు సత్కరించారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన



కన్నాపురం హైస్కూల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీవో

కొయ్యలగూడెం: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి అని ఎంపీడీవోకే కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం కొయ్యలగూడెం , పరింపూడి హైస్కూల్లోని పరీక్షా కేంద్రాల తరగతి గదులను విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మార్చి నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. కన్నాపురం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఎంఈఓజే సురేష్ బాబు, ఈవోపీఆర్‌డీ జి.సతీష్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా రైతుల ధర్నా



కొయ్యలగూడెం సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: విద్యుత్ కోతలకు నిరసనగా కొయ్యలగూడెం సబ్ స్టేషన్ వద్ద రైతులు శుక్రవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. సుమారు 10 రోజుల నుంచి విద్యుత్తు సరఫరా క్రమబద్ధీకరణగా అమలు చేయడం లేదని వేళాపాలా లేని విద్యుత్తు కోతలతో చేతికి అంది వచ్చే దశలో ఉన్న పంటలు నాశనమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, వరి సాగు చేస్తున్న రైతులు సాగునీరు అందకపోవడంతో నష్టపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్‌లోని అధికారులతో వారంతా వాగ్వివాదానికి దిగారు. గత ప్రభుత్వం రైతులకు తొమ్మిది గంటల సరఫరా నిరంతరాయంగా చేయగలిగితే, నేడు ఏడు గంటల సరఫరా చేస్తున్న విద్యుత్తు కూడా సమయానుకూలంగా ఉండడం లేదన్నారు. విద్యుత్ సరఫరా కోసం రేయింబవళ్లు పంట పొలాల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని రైతు కసుకుర్తి వేణు పేర్కొన్నారు. కన్నాయిగూడెం, ఆరిపాటి ఫీడర్ల పరిధిలోని రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. ఓ దశలో రైతులు అధికారులతో ఘర్షణ పడుతూనే జాతీయ ప్రధాన రహదారి పైకి చేరుకుని రాస్తారోకో చేపట్టేందుకు ఉపక్రమించడంతో అధికారులు సర్దిచెప్పారు. విద్యుత్తు సమస్య పరిష్కరించి వ్యవసాయానికి షిఫ్టుల వారీగా సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించుకున్నారు.